
# దేవుడి ఇల్లు

ఉషారాణి భాటియా




గుడిలో చాలా సందడిగా వుంది. జనం ఒకళ్లమీద ఒకళ్లు పడిపోతూ ముందుకి తోసుకు వస్తున్నారు. జన ప్రవాహం గుడిలోపలికి వస్తున్నట్లు వుందిగానీ బైటికి వెళుతున్నట్లు లేదు. అది చిన్న గుడి. ఉక్కగా, ఇరుగ్గా వుంది. విగ్రహం ముందు దీపం తప్ప అంతా చీకటిగా వుంది. దభీమని కొబ్బరి కాయ కొడుతున్న శబ్దం, బ్రాహ్మణుని మంత్రోచ్చరణ, స్త్రీల మాటలతో వాతావరణం హెూరుగా గలగల మంటోంది.

కిందపడిన పూలనీ, ప్రసాదాన్నీ పిల్లలు తీయబోతుంటే, పెద్దలు వారిని వారిస్తున్నారు. గుడి లోపలికి ప్రవేశిస్తున్న పూజారులకి భక్తులు ఒదిగి తోవచేస్తున్నారు. సాయంత్రం ఆరుగంటలవుతుంది. గుడిలోపల ఎంత మంది జనం వున్నారో దాదాపు అంత మంది బైట గుంపుగా చేరి పూలు, పళ్లు కొంటున్నారు. కాస్త ఎత్తుగా కొండమైపుగా వున్న గుడికి సన్నని మెట్లు వున్నాయి. మెట్లు కనపడకుండా జనం వడిగా పైకీ కిందికీ వెళుతున్నారు. ఆ తోపుడు, తొందరలో కొందరు పక్క వారిని గుర్రుగా చూస్తూ లోలోపల గొణుక్కుంటున్నారు. చేతిలో హారతి పళ్లెం, ప్రసాదం గట్టిగా పట్టుకుని ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు ఊగిసలాడుతూ ముందుకి పోతున్నారు. గుడి మెట్లు తడిగా, నలిగిన పూవులతో అడుగులు జాగ్రత్తగా వేయవలసిన అవసరం కల్పిస్తున్నాయి. కానీ భక్తులు ధైర్యంగా, ఉత్సాహంగా అతి తొందరగా ముందుకి పోతున్నారు.

ఆ రోజు భక్తులలో స్త్రీల సంఖ్య ఎక్కువగా వుండటంవల్ల రకరకాల రంగు రంగుల చీరలు కదలాడుతున్నాయి. అందులో రెండే రెండు చీరలు విలక్షణంగా వున్నాయి. ఒకటి ఎర్రంచు నారింజరంగు పట్టుచీర, రెండోది నీలంగళ్ల పోచంపల్లి జరీచీర. ఈ చీరలు కట్టుకున్న స్త్రీలు ఇద్దరూ చూడముచ్చటగా కళ కళలాడుతున్నారు. ఒకామె ముప్ఫయ్యో పడిలో వుంది. పేరు తులశమ్మ రెండో ఆమెకి నలభై దాటింది. ఆమె పేరు లలితమ్మ అందంకన్న వాళ్లిద్దరిలో ఆకర్షణ ఎక్కువ అనవచ్చు. మల్లెలు తురుముకున్న పెద్ద తల ముడులు, ఒంటినిండా మెరుస్తున్న నగలు, ఆనందం తృప్తి నిండుకున్న ముఖాలు- వాళ్లిద్దరూ ఆ వేళ నెమ్మదిగా అడుగులేస్తున్నారు. కుడిచేతిలో పూల పళ్లాలు, ఎడం బుజం మీదుగా నాజూకుగా వేళ్లాడుతున్న పర్సులు, చేతికి వాచీలు- అధునాతనంగా వున్న భక్తులు వాళ్లు. వాళ్ల నడకలో, మాటలో, చూపులో హుందాతనం, నెమ్మది ఉట్టి పడుతున్నాయి.

గుడిమెట్లు ఎక్కి వెళుతున్నప్పుడూ వాళ్లకి తొందరలేదు. దిగుతున్నప్పుడూ తొందర లేదు. తాపీగా, చేతులు కలుపుకుని, గల గలమని నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ కింది మెట్టుకి చేరుకున్నారు.

అప్పుడప్పుడే చీకటి పడుతోంది. గుడి ముందు దీపాలు దివ్యంగా వెలుగుతున్నాయి. చల్లగాలి ప్రారంభమయింది. కింది మెట్టు ఓరగా, వాళ్ల కాళ్లకి ఏదో మెత్తగా తగిలింది, పరీక్షగా చూస్తే అక్కడ ఒక స్త్రీ కూర్చుని వుంది. ఎర్రగళ్ల సాదా చీర, జారుముడి, రబ్బరు గాజులు, మట్టి కాళ్లు- ఆమె చేతిలో పళ్లు, పూలు, కొబ్బరికాయలు లేవు. తలెత్తి దీనంగా పైకి చూసింది.

"ఎవరో బిచ్చగత్తె" అంది చిన్నావిడ తులశమ్మ

"ఊహు! మన లచ్చమ్మలా వుంది" అంది లలితమ్మ

ఇంతలో ఆ స్త్రీ లేచి నిలబడింది. "దండాలండి అమ్మగారూ" అంది చేతులు జోడిస్తూ, ఆ స్త్రీలిద్దరూ ఆగి లచ్చమ్మ వంక ఎగాదిగా చూశారు.

"నువ్వటే! ఎవరో అనుకున్నాను. ఇక్కడేం చేస్తున్నావు? గుడికి వచ్చావా? ఏమైనా మొక్కుకున్నావా?" అడిగింది లలితమ్మ

"మాకేటి మొక్కులండీ? మాది రోజూ మొక్కుల బతుకే వినేవాళ్లు, ఇచ్చేవాళ్లు వుండాలి గానీ," అంది లచ్చమ్మ

"అదేమిటే! అలా మనసు చిన్న చేసుకుంటావు? ఇది దేవుడి ఇల్లు. అయన్ని అడిగితే దొరకని వస్తువు లేదు. పైకి పోయి దండం పెట్టుకో." సలహా యిచ్చింది లలితమ్మ స్నేహితురాళ్లిద్దరి పాదాలూ ముందుకి సాగాయి.

"అమ్మగారూ! నాకో చిన్న సాయం చేసి పెట్టండి" అంటూ లచ్చమ్మ సందేహంగా వారిని అడ్డగించింది.

ఆ ఇద్దరు స్త్రీలలో లలితమ్మకి లచ్చి బాగా తెలుసు. కష్టకాలంలో పిడికెడు బియ్యం, ఓ గుడ్డముక్క, నాలుగు పైసలు అడిగే చనువు వుంది అమెతో. పండుగలు, పూజలు జరిగే రోజుల్లో ఎన్నోసార్లు ఆమె గుమ్మం ముందు తచ్చాడి, ఏదో ఇంత మూట గట్టుకుపోయేది. ఆమె కబురంపితే పరుగున వెళ్లి ఇంటెడు చాకిరీ చేసి వచ్చేది. ఇంట్లో పని మనిషి కాకపోయినా అంతకంటె ఎక్కువగా సేవ చేసేది. అందుకనే ఈ రోజు గుడి ముందు పెద్దామెని ఆపింది. తులశమ్మని మటుకు పూర్వం చూసి ఎరగదు.

"ఫరవాలేదు. చెప్పవే. ఏం సాయం కావాలి?" అడిగింది లలితమ్మ. తులశమ్మ ముఖం గంభీరంగా మారిపోయింది. చేయి పర్సు తెరిచేందుకు ప్రయత్నించింది.

"మీరు పెద్దోళ్లు. చదువుకున్నవారు. నా కష్టం మీకే అర్థమవుతుంది." అంటూ లచ్చమ్మ వాళ్ల కాళ్లకి అడ్డంగా వచ్చి నిలబడింది. ఇంటికి తొందరగా వెళ్లాలనే తొందర అంతగా లేకపోయినా స్నేహితురాళ్లిద్దరూ ముఖాలు విసుగ్గా పెట్టారు.

"చూడు లచ్చమ్మా అదేదో ఇంటి దగ్గిర మాట్లాడుకుందాం. ఇక్కడ కాదు. మేము ఇళ్లు చేరుకోవాలి" అంది లలితమ్మ

"అమ్మగారూ! రేపటికి ఆలస్యమవుతదండీ! నాకీ కష్టం ఇయ్యాల రాత్రేనండీ, అందుకనే దేవుడి కాడికి వచ్చాను" అంది లచ్చమ్మ దీనంగా. స్నేహితురాళ్లిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"సలహాయేకదా! ఫరవాలేదు. ఏదో ఒకటి చెప్పి త్వరగా ముగిద్దాం పద. ఆ వైపు తిన్నె దగ్గిర కూర్చుదాం. అక్కడ వెలుగ్గా కూడా వుంది." అంది లలితమ్మ ఓదార్పుగా. కాస్త అయిష్టంగా, యిబ్బందిగా కుడివైపుకి దారితీసింది. లచ్చమ్మ వెనకాలే తలబంచుకునడిచింది.

"చెప్పు ఏమిటో" ఏకకంఠంతో అడిగారు స్నేహితురాళ్లిద్దరు అసహనంగా.

"అమ్మగారూ! దేవుడు ఎలాటి మాటలు చెబుతాడండీ? మంచి మాటలే ఇనటం అయనకి అలవాటా? లేక చెడ్డమాటలు కూడా ఇంటాడండీ? ఈ దేవుడు ఉలకడు. పలకడు. నేను ఏంటి చేసేదండీ!" లచ్చమ్మ గొంతు బొంగురుపోయింది.

లలితమ్మకి చిర్రున కోపం వచ్చింది.

"ఏం చెప్పాలో త్వరగా చెప్పవే" అంది.

"కోప్పడకండి అమ్మగారూ! నా గోల అలాటిది. మనం ఆడవాళ్లమంతా ఒకటే కదండీ. ఎవరికీ అన్యాయం చేయకూడదు కదండీ?" అడిగింది లచ్చమ్మ



"ఈ హొటల్‌లో అన్నీ సెల్ఫ్ సర్వీసే నట" అన్నాడు నరేంద్ర.

"ఇందులో ఆశ్చర్యపడాల్సిందేముంది మరి" అడిగాడు నాగేంద్ర.

"మనమే పప్పు రుబ్బుకొని కావల్సిన పదార్థం తయారు చేసుకోవాలట ఆశ్చర్యంగాక మరేమిటి?"

శ్రీకొండ ఎర్రబోడు

"అవునే. చెయ్యకూడదు. అది తప్పు. ఇందులో దేవుణ్ణి అడిగేదేముంది? నీకు బుద్ధి లేదా?" తులశమ్మ కలుగజేసుకొని అడిగింది.

"నేను చదువులేని మొద్దుని. నాకు భయమూ వేస్తున్నది. భారంగానూ వుంది. ఈ భారంగా వుండటమే తప్పు, ఒప్పు తెలియటమా అండీ?" లచ్చమ్మ అమాయకంగా వారి వంక చూసి చెప్పుకుపోయింది.

"నాలుగు రోజులుగా ఆ పెద్దాయన మాటలు విని తల దిమ్మెక్కిపోయినాదండీ! నాకా మొగదిక్కు లేదు. ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని, ఆడనీ ఈడనీ పని చేసి గడుపుతున్నాను. ఆ పెద్దాయన అన్నాడు కదా, నా ఆడది రెండు నెలలు పూరెళుతోంది. నువ్వు పగలంతా నా ఇంటికాడ వుండి, వండి, వార్చి రాత్రికి గుడిసెకి పో" అని.

స్నేహితురాళ్లిద్దరికీ ఇక ఓర్పు నశించింది. ఇంటికి వెళ్లడానికి ఉద్యుక్తులయ్యారు.

"అమ్మగారూ! పూర్తి గా వినండమ్మా మా కులం వాళ్లు అంటారు కదా! అది మనసు మంచిది కాదు. రేపు అమ్మగారొస్తే డొక్క చీలుస్తారు" అని.

లలితమ్మ అందుకుంది. "అంతే కాదు; పిచ్చిదానా? రేపు ఆ పెద్ద మనిషి నీతో అడ్డ దిడ్డంగా ప్రవర్తిస్తే ఏం చేస్తావు?"

తులశమ్మ కూడా అంది. "ఇట్లాంటి పనులు ఒప్పుకోక. ఆ మనిషి మనసు మంచిదయితే పెళ్లాన్నే నీతో మాట్లాడమని అడగవచ్చు కదా."

స్నేహితురాళ్లిద్దరూ ఇంటి ముఖం పట్టారు. "ఇంతకీ లచ్చమ్మా! ఈ మాట అడిగేందుకు గుడికి ఎందుకు వచ్చావే!" ఆగి అడిగింది లలితమ్మ

"దేవుడు, మనిషి మనసులోనే వున్నాడు. మంచి చెడులాటి పెద్ద మాటలు నాకు తెలియవండీ! ఈ మెట్లమీద కూచుంటే కాస్త బుద్ధి తగులుతుందేమో అని వచ్చానండీ. పై మెట్టు వరకూ వెళ్లకుండానే మీలాటి గొప్పోళ్లు తగిలి మంచి మాట చెప్పారండీ. కష్టాలు భరించలేక డబ్బుకి ఆశ పడింది పాడు మనసు" సిగ్గుపడుతూ తల ఒంచుకు గొణికింది లచ్చమ్మ

"అదేమిటే! దేవుడి గుమ్మం వరకూ వచ్చి అలా వెళ్లి పోకూడదు. తప్పు, పై వరకూ వెళ్లి ఏదయినా కోరుకో. ఇంద ఈ డబ్బులు తీసుకో" తులశమ్మ లచ్చి చేతిలో రూపాయి పెట్టబోయింది.

"వద్దండి అమ్మగారూ! ఈడనుంచే దణ్ణం పెట్టుకుపోతానండీ" అంటూ పోబోతున్న లచ్చమ్మని పట్టుకుని ఆపింది లలితమ్మ "అడగకూడదుగానీ, ఇంతకీ, ఆ పెద్ద మనిషి ఎవరేమిటి?" కుతూహలంగా చూస్తూ అడిగిందామె.

లచ్చమ్మ ఓ క్షణం ఆగి ఇటూ అటూ చూసింది.

"అమ్మగారూ! మరెవరితో అనబోకండి. ఇటు నుంచి తిన్నగా పోయి ఆ మూడో సందులో తిరిగితే రెండంతస్తుల మేడ లేదండీ, దానికి అనుకుని వున్న ఇటిక రంగు మేడండీ..."

• • •

లచ్చమ్మ వెళ్లిపోయింది. మెట్లు ఎక్కి దేవుడి ఇంటికి కాదు. మెట్లు దిగి తన గుడిసె వైపుకి. ఆమె ఎన్నడూ చూడని, ఊహించని, పూజించని, అర్చనలు చేయని- కానీ నిత్యం ఆమె మనసులో వున్న - దేవుడు ఆమెని శాంత పరిచాడు.

కానీ ఆ గుడిమెట్లు విడవకుండా అనేకసార్లు ఎక్కి దిగి, దేవుడి ఇంట్లో అర్చనలు చేసి, తమ కోర్కెలు తీర్చమని వేడుకున్న ఆ దేవుడు - స్నేహితురాళ్లిద్దరినీ కలతగా అశాంతిగా వదిలి వేశాడు.

ఇటిక రంగు మేడ యజమానురాలు తులశమ్మ వంక చూసే ధైర్యం లేక తల ఒంచుకు నెమ్మదిగా అడుగులు వేసింది లలితమ్మ ☆